క్లుప్తంగా

అన్నదానం

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని పైలట్‌కాలనీ ప్రాంతంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదానం ఏర్పాటు చేశారు. మణుగూరు సీఐ నాగబాబు కార్యక్రమాన్ని ప్రారంభించగా.. నిర్వాహకులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో మామిడి జేమ్స్, రావర్తి శ్రీహరి, కంపాటి రవి, దొర బాబు, హేమంత్, గద్దం పవన్‌కుమార్, శివ సాయి, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

చర్లలో..

చర్ల: మండలంలోని కుదునూరులో ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పొగళ్ల రాము, ఎలగొండ రాకేశ్, కొంబత్తిని ప్రశాంత్, సిద్ది సాయికిరణ్, ఎలగొండ శ్రీనివాస్, కోడిరెక్కల సత్యనారాయణ, బట్టా శ్రీనివాస్, సిద్ధి అరుణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో సుదర్శన హోమం



సుదర్శన హోమం జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ): అన్నపురెడ్డిపల్లిలో వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సుదర్శన హోమం నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం శ్రావణ నక్షత్రాన్ని పురస్కరించుకుని హోమం జరిపించారు. ప్రధాన పూజారి ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆలయ ఇన్‌చార్జ్ మేనేజర్ పీవీ రమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మణుగూరురూరల్: సింగరేణి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7వ తేదీన తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ముద్రించిన వాల్‌పోస్టర్లను జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్డీ నాజర్‌పాషా శుక్రవారం కేసీహెచ్‌పీ వద్ద ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు.. అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు సింగరేణి ఆర్జించిన లాభాల్లో నుంచి 15 శాతం స్పెషల్ ఇన్సెంటివ్‌గా చెల్లించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. కార్యక్రమంలో ఇఫ్టూ ఏరియా అధ్యక్షుడు మంగీలాల్, కాంట్రాక్ట్ కార్మికులు సంజీవరావు, వెంకటేశ్వర్లు, సాంబయ్య, లింగయ్య, భద్రం, పిచ్చయ్య, కృష్ణ, అరుణ, సతీష్, రమేష్, జాన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సదస్సును విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ములకలపల్లి: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, స్కీం వర్కర్ల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.సీతారామయ్య పిలుపునిచ్చారు. చాపరాలపల్లిలో శుక్రవారం సదస్సు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి, మాట్లాడారు. పాలకపక్షాలు ప్రభుత్వరంగ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు చట్టబద్ధమైన వేతనాలు చెల్లించడం లేదని విమర్శించారు. హైదరాబాద్‌లో రేపు నిర్వహించనున్న సభకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. నాగరాజు, హరిబాబు, ఆదినారాయణ, ధనలక్ష్మి, రుక్మిణి, దశరథరామయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడిగా దొడ్డా



నియామకపత్రం ఇస్తున్న రేగా కాంతారావు

దమ్మపేట: బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడిగా మొద్దులగూడెం గ్రామానికి చెందిన దొడ్డా రమేశ్ ఎంపికయ్యారు. ఆయనకు కొత్తగూడెం బీఆర్‌ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు శుక్రవారం నియామకపత్రం అందించారు. అనంతరం తాటిసుబ్బన్నగూడెంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చాను మర్యాదపూర్వకంగా కలవగా ఆయన అభినందనలు తెలిపారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

కరకగూడెం: మండలంలోని భట్టుపల్లి కేజీబీవీలో శుక్రవారం టీచర్స్‌డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు గురువుల వేషధారణలో తరగతి గదుల్లోకి వెళ్లి పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తమ అనుభవాలను వివరించడంతోపాటు సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలమని పేర్కొన్నారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దమ్మపేటలో..

దమ్మపేట: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హాజరై సర్వేపల్లి రాధకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పలువురు ప్రభుత్వ అధ్యాపకులు, రిటైర్డ్ ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ కీసర లక్ష్మి, హెచ్‌ఎంలు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేటరూరల్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో టీచర్స్ డేను శుక్రవారం నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న, రిటైర్డ్ ఉపాధ్యాయులు అద్దంకి లక్ష్మీనారాయణ, అరవింద్, కొఠారు చలపతిరావు, సదాశివ దంపతులను సత్కరించారు. కార్యక్రమాల్లో లక్కినేని నరేంద్ర, యూఎస్ ప్రకాశ్‌రావు, కోటగిరి మోహన్‌రావు, బలమూరి సూర్యారావు, దూపకుంట్ల దుర్గారావు, దారా మల్లికార్జున్‌రావు, ఐతం వెంకటేశ్వరరావు, జూపల్లి బ్రహ్మారావు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలో..

భద్రాచలంటౌన్: విద్యార్థికి ఉపాధ్యాయులే మార్గ నిర్దేశకులని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అన్నారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన టీచర్స్ డే కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బొగ్గా నారాయణ, ఎంఈఓ టి.రమ, రమాదేవి, పాపయ్య, బ్రహ్మేశ్వరరావు, కరుణ్‌కుమార్, ఏడుకొండలు, రమాదేవి, పద్మజ, శ్రీనివాస్, విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, కాంతారావు పాల్గొన్నారు.

మణుగూరులో..

మణుగూరుటౌన్: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందినవారిని మణుగూరు మండల విద్యాశాఖ, వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, నవ సమాజ రూపశిల్పులు ఉపాధ్యాయులేనన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ స్వర్ణజ్యోతి, ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, పరమయ్యతోపాటు గాండ్ల సురేశ్, బాబు, నాగశ్రీ, షేక్ మీరాహుస్సేన్, రామారావు, తోలం శ్రీనివాసరావు, రఘుమోహన్‌రావు, స్వరూపారాణి, చాముండేశ్వరి, శ్యామ్, బండారు నర్సింహారావు, కడవెండి విశ్వనాథగుప్తా, వనమా లక్ష్మీనారాయణగుప్తా, చిత్తలూరి రమేశ్‌బాబు, బొడ్డు పుల్లారావు, కంకటాల సాయి కుమార్ తదితరులు ఉన్నారు. సింగరేణి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం, డీజీఎం (పర్సనల్) సలగల రమేశ్, ప్రధానోపాధ్యాయురాలు కల్యాణి పాల్గొన్నారు.

చర్లలో..

చర్ల: చర్లలోని గురుదేవ్ విద్యాలయంలో నిర్వహించిన గురుపూజోత్సవం కార్యక్రమం ప్రిన్సిపాల్ గిరిప్రసాద్, ఎంవీ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యాపకులను సత్కరించారు.

అవార్డు అందుకున్న హెచ్‌ఎం

అశ్వాపురం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మండలంలోని నెల్లిపాకబంజర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు.



మణుగూరుటౌన్: సన్మానం పొందిన ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



భద్రాచలంటౌన్: ఉపాధ్యాయ దినోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావు



దమ్మపేట: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు



కరకగూడెం: టీచర్స్‌డే వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థినులు



చర్ల: అధ్యాపకులను సత్కరిస్తున్న దృశ్యం



అశ్వారావుపేటరూరల్: చలపతిరావు దంపతులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు

గణేశ్ పూజల్లో ముస్లింలు



జహీర్‌ను సత్కరిస్తున్న అంజి తదితరులు

ములకలపల్లి: మిలాద్ – ఉన్ – నబీ సందర్భంగా ముస్లింలు శుక్రవారం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాగా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బత్తుల అంజి ఆధ్వర్యంలో ములకలపల్లిలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద అన్నదానం చేయగా అందులో పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

ఆర్య, వైశ్యులకు ప్రాధాన్యత ఇవ్వాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

అశ్వారావుపేటరూరల్: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యులకు ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ ఒక్కరోజు సాధన దీక్షను చేపడుతున్నట్లు వైశ్య వికాస వేదిక ట్రస్టు సభ్యులు కొదుమూరి దయాకర్ తెలిపారు. శుక్రవారం అశ్వారావుపేటలో స్థానిక ఆర్యవైశ్య సంఘం బాధ్యులను కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి, మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్యవైశ్యుల వాటా ఎంత? అనే నినాదంతో ముందుకు వెళ్లాలన్నారు. ఈ నెల 9వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల దాకా ఒక్కరోజు దీక్ష చేపడుతున్నామని, ఆర్య వైశ్యులంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జల్లిపల్లి లోకనాథ్‌గుప్తా, కుక్కటపు రాంబాబు, జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, ఎస్.బాలగంగాధరరావు, బోగవల్లి రాంబాబు, పద్దం రవి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలను చెల్లించాలి



కరకగూడెం: సమ్మె నోటీస్ అందజేస్తున్న కార్మికులు



అశ్వారావుపేటరూరల్: హెచ్‌ఎంకు సమ్మె నోటీస్ అందిస్తున్న కార్మికులు



దుమ్ముగూడెం: నినాదాలు కార్మికులు

కరకగూడెం: ఐటీడీఏ పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లకు ప్రస్తుతం ఇస్తున్న వేతనాలను జీఓ నంబర్ – 64 ప్రకారం కాకుండా, పాత గెజిట్ ప్రకారమే చెల్లించాలని సీఐటీయూ మండల నాయకుడు కొమరం కాంతారావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని, అలాగే హాస్టల్ డైలీ వర్కర్లను రెగ్యులర్ చేయాలని కోరారు. జీఓ నంబర్ 64 అమలులోకి వస్తే కార్మికుల వేతనాలు సగానికి తగ్గిపోతాయని, ఇప్పటికే నెలల తరబడి వేతనాలు పెండింగులో ఉండటంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సందర్భంగా ఆయన చిరుమళ్ల హాస్టల్ వార్డెన్ రవీందర్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో పలువురు హాస్టల్ వర్కర్లు పాల్గొన్నారు.

సమ్మె నోటీసులు అందజేత

అశ్వారావుపేటరూరల్: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న దినసరి కార్మికుల వేతనాలు తగ్గించవద్దని, కార్మికులను పర్మనెంట్ చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 12వ తేదీన చేపట్టిన సమ్మెను జయప్రదం చేయాలని హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాల యూనియన్ జేఏసీ నాయకులు బైటా నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం మండలంలోని సున్నంబట్టి, పెదవాగు ప్రాజెక్టు, అనంతారం, అశ్వారావుపేట ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలకు సమ్మె నోటీసులను అందించారు. 30 ఏళ్లుగా పనిచేస్తున్న దినసరి కార్మికుల వేతనాన్ని రూ.26,800 నుంచి రూ.11,700కు తగ్గించి ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వ చెప్పడం తగదన్నారు. ఈ సమస్యను పరిష్కరించే దాకా ఈ నెల 12 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్, బత్తుల శ్రీను, జెట్టి వెంకటేశ్వర్లు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో మిషన్ భగీరథ కార్మికులు

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల క్రాస్ రోడ్డులో గల మిషన్ భగీరథ సైట్‌లో పనిచేస్తున్న కార్మికులకు మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో శుక్రవారం నుంచి సమ్మె చేపట్టారు. జీతం వేతనాలు వెంటనే చెల్లించాలని, ప్రతీ నెలా జీతం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు. కార్మికుల సమ్మెతో దుమ్ముగూడెం, చర్ల మండలాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోనుంది. సమ్మెలో కార్మికులు సాయిచంద్, శ్రీను, కళ్యాణ్, సంతోష్, పవన్‌రెడ్డి, క్రాంతి, సాయిరెడ్డి, రాములమ్మ, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

స్థాయికి మించి వైద్యం చేయరాదు..



గ్రామంలోని ఓ క్లినిక్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డాక్టర్ ప్రియాంక

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ): పరిమితికి మించి వైద్యం చెయొద్దని ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ప్రియాంక ఆర్‌ఎంపీలకు సూచించారు. గ్రామంలోని క్లినిక్, రక్త పరీక్ష కేంద్రాలను ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ.. పేషంట్లకు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని చెప్పారు. వారికి ఇంజెక్షన్లు ఇవ్వొద్దని, సెలైన్‌లు పెట్టొదని పేర్కొన్నారు. రక్త పరీక్ష కేంద్రాలను నిర్వహించొద్దని చెప్పారు. నిబంధనలు ఉల్లఘించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వైద్యురాలు హెచ్చరించారు.

ఆంబోతుకు అంత్యక్రియలు

చండ్రుగొండ: చండ్రుగొండకు వదిలిన ఆంబోతు మృతిచెందడంతో కళేబరానికి గ్రామంలోని ఆలయాల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అంతిమయాత్ర నిర్వహించారు. మేళతాళాలతో గ్రామ వీధుల్లో ఊరేగించి, గ్రామ శివారులో ఖననం చేశారు. ప్రధాన పూజారి వీవీఆర్‌కే మూర్తి ఆధ్వర్యంలో కుక్కడపు రామారావు, కీసరి కిరణ్‌రెడ్డి, చీదళ్ల పవన్‌బాబు, బుంగా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి'



నిరసన తెలుపుతున్న నాయకులు

భద్రాచలంటౌన్: భారత రాజ్యాంగానికి విరుద్ధంగా చేరిన లంబాడా కులాన్ని తక్షణమే ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోయం కామరాజు, ఏఈడబ్ల్యూసీఏ రాష్ట్ర అధ్యక్షులు తెల్లం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. భద్రాచలం హరిత హోటల్‌లో శుక్రవారం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎస్టీల్లో లంబాడా కులం చేరిక భారత రాజ్యాంగం ఆర్టికల్ 342 (1) – (2)కు విరుద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఆర్టికల్ 342 (1) అధికరణ ప్రకారం షెడ్యూల్డ్ ట్రైబల్ కులాలను జాబితాలోకి తీసుకురావడంతో పాటు తొలగించడానికి రాష్ట్రపతి ఆమోదం లేకుండా అప్పటి ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా లంబాడాలను దొడ్డిదారిన ఎస్టీ జాబితాలో కలిపారని ఆరోపించారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, మాజీ ఎంపీ సోయం బాపూరావు సుప్రీంకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ వేశారని పేర్కొన్నారు. సుగాలీలు ఆంధ్ర ప్రాంతంలో ఎస్టీలు కాబట్టి తెలంగాణలో ఉన్న సుగాలీలను కూడా ఎస్టీలుగా పరిగణించాలని వారు కోరారు. అనతంరం ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏటీపీ రాష్ట్ర అధ్యక్షులు కల్లూరి జయబాబు, పోడియం బాలరాజు, మెట్ల పాపయ్య, రాంబాబు, ఈసాల సురేశ్, పూనెం కృష్ణ, రామకృష్ణ, గోగ్గల రామస్వామి, పాయం రవి వర్మ, సీతయ్య పాల్గొన్నారు.

ప్రవక్త బోధనలు అనుసరణీయం

కరకగూడెం: ప్రవక్త మహమ్మద్ బోధనలు అనుసరణీయమని మహ్మద్ ఫిరోజ్ పేర్కొన్నారు. శుక్రవారం మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రంలోని జామా మసీదులో మౌలానా మహ్మద్ ఫిరోజ్ మాట్లాడుతూ.. మహమ్మద్ ప్రవక్త చూపిన శాంతి, కరుణ, దయ, సమానత్వం వంటి విలువలు నేటి సమాజానికి ఎంతో అవసరమని తెలిపారు. మతం పేరుతో విభజనకు తావు లేకుండా ఉండాలని, ప్రజలు అందరూ సమానత్వంతో జీవించాలని కోరారు. అజ్ఞానం, మూఢ నమ్మకాలను తొలగించేదే జ్ఞానమని ఆయన వివరించారు.



మాట్లాడుతున్న ఫిరోజ్

కొమరయ్యకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

అశ్వారావుపేటరూరల్: సీపీఐ నాయకుడు మనుబోతుల కొమరయ్య 29వ వర్ధంతి సందర్భంగా ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. అశ్వారావుపేటలోని సీపీఐ కార్యాలయంలో కొమరయ్య చిత్రపటానికి పార్టీ జిల్లా కమిటీ నాయకుడు ఎస్‌డీ సలీం ఆధ్వర్యంలో పూలమాల వేశారు. కొమరయ్య ఎన్నో ప్రజా ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో గన్నిన రామకృష్ణ, వగ్గెల అర్జున్‌రావు, ఎస్‌డీ జాకీర్, జక్కం బలరాం, ముత్తు, ఎస్‌కే లాలు, పి.చిన్నారావు పాల్గొన్నారు.

మణుగూరులో..

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక సభ్యులు మనుబోతుల కొమరయ్య 29వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఏఐటీయూసీ నేతలు ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ వై.రాంగోపాల్, మేకల ఈశ్వర్, పుల్లారావు, గోలి గంగాధర్‌రావు, ఆవుల నాగరాజు, నంబూరు శ్రీనివాస్, శనిగరపు కుమారస్వామి, గంపెనపల్లి శ్రీనివాస్, శరత్, సాయి ప్రకాశ్, అంతోని రవికుమార్, పద్మావతి, రత్నం, శివకుమార్, జానకీప్రసాద్, మంద కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వైభవంగా వినాయకుని కల్యాణం

దుమ్ముగూడెం: మండలంలోని వర్క్‌షాప్ వద్ద స్వయంభూగా ఏర్పడిన రత్నాల గణపతి ఆలయంలో వినాయక నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం కల్యాణం నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం కల్యాణ తంతును శాస్త్రోక్తంగా జరిపించారు. భద్రాచలం, వరంగల్ ఎస్‌ఈలు నరసింహారావు, రామ్‌ప్రసాద్, డీఈఈలు మధుసూదన్‌రావు, తిరుపతిరావు, ప్రసాద్, మధు, ఏఈఈలు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కిటకిటలాడుతున్న ప్రభుత్వాస్పత్రి



వంద పడకల ఆస్పత్రిలో కిటకిటలాడుతున్న రోగులు

- 500కు మించి నమోదవుతున్న ఓపీ
- తగిన జాగ్రత్తలు పాటిస్తేనే వ్యాధులు దూరం

మణుగూరుటౌన్: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో నీరు నిలిచి దోమలు పెరగగా సీజనల్ వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. దీంతో మణుగూరులోని వంద పడకల ఏరియా ఆస్పత్రికి వైరల్, సీజనల్ వ్యాధులతో వచ్చే వారు బారులు దీరుతున్నారు. వాతావరణ మార్పులతో, నీటి మార్పు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారు తీవ్ర అస్వస్థతకు గురై దవాఖానకు వస్తున్నారు. మణుగూరు నుంచే కాక కరకగూడెం, పినపాక, రాజుపేట నుంచి సైతం వైద్య సేవలకు జనం వస్తుండడంతో ప్రతిరోజు 100కు పైగా ఓపీ నమోదవుతోంది. దీంతో ఆస్పత్రి రోజూ రోగులతో కిటకిటలాడుతోంది.

జాగ్రత్తలు పాటించాలి



వాతావరణంలో మార్పులు, మారుతున్న నీటి వల్ల జ్వర లక్షణాలు అధికమవుతున్నాయి. రెండు రోజులు జ్వరం తీవ్రంగా బాధిస్తే మూడు రోజు ఖచ్చితంగా రక్తపరీక్షలు చేయించుకోవాలి. కాచి చల్లార్చిన నీటి సేవించి పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ... వేడి ఆహారాన్ని తీసుకోవాలి.

– సునీల్, ఆస్పత్రి సూపరింటెండెంట్

జ్వరాల కేసులే అధికం..

మణుగూరు 100 పడకల ఆస్పత్రిలో ప్రసూతి, జనరల్ వార్డు, పిడియాట్రిక్ అన్ని వార్డుల్లో కలిపి 111 బెడ్లు ఉండగా, జనరల్, క్యాజువాలిటీలో 60 బెడ్లు ఉన్నాయి. గత పది రోజులుగా వస్తున్న జ్వర పీడితులతో ఒక్క బెడ్డు ఖాళీగా ఉండని పరిస్థితి నెలకొంది. పినపాక మండలం జానంపేట, నుంచి అశ్వాపురం మండలం మొండికుంట నుంచి ఈ ఆస్పత్రికే వైద్యసేవలకు వస్తుండటం గమనార్హం. పినపాక మండల ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో రక్త పరీక్షలకు ఇక్కడికే వస్తుండటంతో రద్దీ అధికమైంది.